# వజ్రాయుధం ★ "భ. రా."

రమాకాంతరావుగారికి ఏభయ్యోపడి వచ్చిపడింది. ఇద్దరుకొడుకులికీ పెళ్ళిళ్ళు చేసి నెత్తిమీద బరువు దించుకొన్నట్టు సంతోషించాడు. ఉమి ఒక్కత్తే కూతురు. పెళ్ళీడుపిల్ల. ముసలితనం అసైనా లెక్కచేయక వెదికి వెదికి చదువుకున్న మాధవరావుకిచ్చి వివాహం చేశాడు.

పచ్చటి శరీరచ్ఛాయ. ఇతరులను బలవంతంగా ఆకర్షించే తీర్చి దిద్దిన కళ్లు. చిరునవ్వులు కురిపించే ముఖంలో ఏవో తేజస్సుతో నిండిన అమాయకత్వం కనిపిస్తోంది; ఆమె ఉమి. పల్లెటూరి ఆడపడుచు.

భర్తతో కాపురానికి పోయింది. ఒకటి రెండు ఏండ్లు బాగా దొర్లాయి. మాధవరావు ఉమి. అమాయకత్వాన్ని బాగా ఉపయోగించుకోవడం మొదలుపెట్టాడు. ఆమెకున్న మూఢభక్తి అతనికి అంగరక్ష అయింది. తల్లిదండ్రులు నూరిపోసిన పిచ్చి నమ్మకాలు ఉమికి వంటపట్టాయి. మాధవ వగలమారైన సుందరి అనే వేశ్యవలలలో తగుల్కొన్నాడు. పాపం! ఉమి ఏమనగలదు?

ఊరంతా అట్టుడికి వట్టుడికిపోతోంది. మాధవకు మతి పోయిందన్నారు కొందరు. "అందాల ఖనిని వదలి ఆవేశ్యరంగు మొగానికి మురిసిపోయా డేమిటమ్మా" కాలమహిమ. "మొగపురుగుల బుద్ధు లిలా మొద్దులై పోతున్నాయి ఏం చెప్మా" అని వేదాంత దృష్ట్యా పలికిందో వితంతువు. తీతువుపిట్టలాంటి గొంతుకతో "వీడికేం పోయకాలమమ్మా! ఇంటిదాన్ని వదలి పరాయిదాంతో పోతున్నాడు" అని అరచిందో రగడుతేరిన తెల్లపిల్ల. పెళ్ళిళ్ళు కాని పిల్లలంతా తెల్లపోతున్నారు. ఉమి అన్నిమాటల్నీ నోరెత్తకుండా జీర్ణం చేసుకొంటోంది. ఎంత ఓర్పు!

అల్లారు ముద్దుగా పెరిగిన చెల్లెలి జీవితం యిలా వుండడం అన్నలిద్దరికీ మరీ దుర్భరమై పోయింది. వారంరోజులు బుద్ధినంతా వినియోగించి ఒక మంచి ఆలోచనచేశారు. ఉమితో చెబితే వ్యవహారం విషమిస్తుందని ఆమెకు తెలియజేయలేదు. ప్రపంచం నోరుమూయడం అంటే మాటలా?

రోజూ లాగే మాధవ సూర్యాస్తమయం అయ్యాక యింటికి వచ్చాడు. స్నానంచేసి, భర్తకెక్కడ కోపం వస్తుందో అని వడ్డించిన విస్తరి రెండుముద్దల్లో ఎగరేశాడు. బయటకొచ్చి 'తలుపేసుకో' అని గద్దించాడు. పాపం! ఉమి. ఈనాడుకూడా నిరాశా ప్రపంచంలో మునిగిపోయింది.

అప్పుడే తాలూకాఫీసులో తొమ్మిదికొట్టారు. మాధవ చరచరా సుందథం యింటివైపు పోతున్నాడు. నిర్జనప్రదేశం. దృష్టి ముందుకేగాని వెనక్కుపోవడం లేదు. ముందు వెనక లాలోచించే వివేకం అతని కెక్కడవుంది?

ఏదో తెల్లటిగుడ్డ వెనకనుంచి మొహంమీద పడింది. ఒళ్ళు ఝల్లుమంది. క్షణంలో గుడ్డ కళ్ళు కనుపించకుండా తాడుతో కట్టబడింది, చేతులు బంధింపబడ్డాయి. ఆ పవిత్ర క్షణాలగాయితు అతని హృదయంకూడా కదలకుండా బంధింపబడిందేమో?

ఇద్దరు పురుషుల నీడలు బంధితుని చావబాదుతున్నాయి. కొనయూపిరి వుండేదాకా బాదాయి. గప్-చిప్-క్షణంలో మాయమయ్యారు.

ఇంకా రాలేదేమని సుందరి తన సోదరుణ్ణి పంపింది. ఇంతలో యిరుగుపొరుగువారు పోగయ్యారు అతని కూనిరాగంవిని, నెమ్మదిగా అతని ఊరు తెలిసికొని తెల్లారేప్పటికి యిల్లు చేర్చారు. ఉమి తెల్లబోయి గొల్లుమంది. ఎవరో కిట్టనివాళ్ళు, సుందరిమీద ప్రేమున్నవాళ్ళు కొట్టేరనుకొంది.

పదిమందికీ తెలిసిందీవార్త. ఉమి. అన్నగార్లు, విచారం నటించారు. క్రమంగా మాధవ ఆరోగ్యం కోలుకొన్నాడు.

సాయంకాలం పడడం భయం. అస్తమించే సూర్యుడతనిలో ఏదోభయం నూరిపోస్తున్నాడు. చీకటిపడితే యిల్లు కదలడంలేదు. అదే స్వర్గంలావుంది ఉమికి. అది చూసి తల్లీ కొడుకులు ముసిముసి నవ్వులు నవ్వారు. ఊరువారి నోరు కట్టబడింది. డబ్బిస్తే కొండమీదకు దిగుతుంది. దెబ్బకి దెయ్యం దడుస్తుంది.

Published by M. S. Murthy at 12, Thambu Chetty Street, Madras, and
Printed by B. Nagi Reddi at B. N. K. Press, 43, Acharappan Street, Madras.
*Editor : V. KALIDAS.*